
సాక్షి
వికారాబాద్

గురువారం । 22 । జూన్ । 2023



వేగ పరిమితి దాటితే ఫైనే

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై స్పీడ్‌గన్లను ఏర్పాటు చేశారు. 4లో▸



పరిశుభ్రత లోపిస్తే..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత లోపిస్తే చర్యలు తప్పవని మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి తెలిపారు. 4లో▸



ఆలయాల అభివృద్ధికి కృషి

ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 4లో▸

న్యూస్‌రీల్

సీటీస్కాన్ సేవలు పునరుద్ధరణ

తాండూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బుధవారం సీటీ స్కాన్ సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. కొన్ని నెలలుగా యంత్రం మరమ్మతుకు ఆస్పత్రి వర్గాలు ఆసక్తి చూపలేదు. దీంతో రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల వద్దకు వెళ్లేవారు. అయితే స్కానింగ్ యంత్రం మరమ్మతుపై అనుసరిస్తున్న నిర్లక్ష్యంపై ప్రజలు అసహనం వ్యక్తంచేశారు. ఎట్టకేలకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్ యంత్రాన్ని మరమ్మతు చేయించి సేవలను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులకు సీటీ స్కాన్ మెషిన్ అందుబాటులోకి తెచ్చామన్నారు. 24 గంటల పాటు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేవలం రూ. 800 మాత్రమే చెల్లించి స్కానింగ్ సేవలు వినియోగించుకోవాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పాత ఫొటోలు, వీడియోలు, మెసేజ్ లు ఫార్వర్డ్ చేసినా, షేర్ చేసినా, పోస్టు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇతర మత విశ్వాసాలపై వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు, పోస్టులు చేయరాదన్నారు. సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

విద్యార్థినితో హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన

సస్పెండ్ చేసిన విద్యాధికారి

మోమిన్‌పేట: విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన పాఠశాల హెచ్‌ఎంపై కేసు నమోదు చేసిన ఘటన బుధవారం వెలుగుచూసింది. మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినితో హెచ్‌ఎం అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ నెల 19న సాయంత్రం ఆఫీస్ రూంను శుభ్రం చేయాలని పిలిపించుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక పారిపోయి బయటికి వచ్చింది. మరునాడు పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థిని నిరాకరించడంతో తల్లి నిలదీసింది. దీంతో అసలు విషయం చెప్పింది. ఉదయం బంధువులతో పాఠశాల వద్దకు వెళ్లిన తల్లి హెచ్‌ఎంను ప్రశ్నించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపారు. ఇదిలా ఉండగా ఈ విషయమై విచారణ జరిపిన విద్యాధికారి అబ్దుల్ గని.. సదరు హెచ్‌ఎంను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు.

యాదాద్రిలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పూజలు



ఎమ్మెల్యేకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: తాండూరు పట్టణంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 11 రోజుల పాటు నిర్వహించే రాజశ్యామల, అతి రుద్ర మహా యాగం ఎలాంటి ఆటంకాలు కలగకుండా విజయవంతంగా పూర్తి కావాలని కోరుతూ యాదాద్రీశుడిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ రాజశ్యామల అతిరుద్ర మహా యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే వర్గంలోకి ‘ఏకాంబరి’ మాజీ చైర్మన్

బషీరాబాద్: మండలంలోని నీళ్లపల్లి ఏకాంబరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి చేరారు. ఎమ్మెల్సీ వర్గంలో ముఖ్య నాయకుడిగా ఉన్న సుధాకర్‌రెడ్డి ఇద్దరు సోదరులు శ్రీనివాస్‌రెడ్డి, జగన్నాథ్ రెడ్డి బుధవారం తాండూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గంలో చేరారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషికి మద్దతుగా నిలుస్తామని అన్నారు. ఎమ్మెల్యేతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ రాజు గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



వికారాబాద్ అర్బన్ పట్టణంలో యోగాసనాలు చేస్తున్న స్థానికులు



అనంతగిరి: ఎస్ఎల్‌బీలో విద్యార్థినుల యోగాసనాలు



తాండూరు టౌన్: చక్రాసనంలో..

ఆరోగ్య యోగం

జిల్లా అంతటా ‘యోగా’నందమే. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం యోగా డే వేడుకలు నిర్వహించారు. వాకర్స్, కాలనీ అసోసియేషన్లు, యోగా సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేసి యోగాసనాలను ప్రదర్శించారు. యోగ నిపుణుల సమక్షంలో సాధకులు పలు రకాల యోగాసనాలు ప్రదర్శించి అబ్బురపరిచారు. పలుచోట్ల జరిగిన యోగా డే ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు హాజరై యోగా విశిష్టతను వివరించారు. ప్రతి నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు.

పరిహారం అందేనా?



ఇటీవల కురిసిన వడగళ్లకు ధ్వంసమైన పంటలు

సీఎం హామీ ఏమాయె
- రెండు నెలలు దాటినా జమకాని పైసలు
- జిల్లాలో పంట నష్టం 3,399 ఎకరాలు
- సాగు పెట్టుబడి కోసం రైతన్న దిక్కులు

వికారాబాద్: ‘పంట నష్టపరిహారం వచ్చేసింది. రెండు మూడురోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తాం..’ అంటూ సీఎం ప్రకటించారు. ఇవే మాటలు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సైతం పేర్కొన్నారు. రైతుల నుంచి ఖాతా నంబర్లు కూడా సేకరించారు. ఈ హడావుడి జరిగి రెండు నెలలు దాటింది. అయినా రైతుల ఖాతాల్లో నేటికీ చిల్లి గవ్వకూడా జమకాలేదు. గత మార్చిలో వడగళ్ల వాన సృష్టించిన బీభత్సానికి జిల్లాలో మర్పల్లి, మోమిన్‌పేట తదితర మండలాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఆ వెంటనే మంత్రులు పర్యటించి రైతులను పరామర్శించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నష్టపోయిన పంటలకు సంబంధించిన నివేదికలు ప్రభుత్వానికి అందజేశారు. పంటలు నష్టపోయిన నెల తరువాత ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం అందజేస్తామని గత ఏప్రిల్ 20న సీఎం ప్రకటించారు. నిధులు కూడా రిలీజ్ చేశామని తెలిపారు. పరిహారం విడుదల చేశామని ప్రకటించి రెండు నెలలు గడిచింది. ఇలా సీఎం చెప్పిన మాటలకే దిక్కు దివానం లేకుంటే ఇక ఎవర్ని విశ్వసిస్తామని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ సాగు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.

సగం ఎకరాలకే పరిహారం!

ఇటీవల పంట పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. వ్యవసాయ పంటలకు ఎకరానికి రూ.30 నుంచి 40 వేల వరకు ఖర్చవుతుండగా ఉద్యాన పంటల విషయానికి వస్తే ఎకరానికి రూ.60 వేల నుంచి కొన్ని రకాల పంటలకు రూ.లక్షకు పైగా పెట్టుబడి వ్యయం అవుతుంది. ఈ నేపథ్యంలో ఎకరానికి పరిహారం రూ. 30వేల నుంచి లక్ష వరకు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలతో పాటు రైతులు కూడా డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం పంట ఏదైనా సరే ఎకరానికి రూ.10 వేల పరిహారం ప్రకటించింది. మార్చి, ఏప్రిల్ మాసాల్లో కురిసిన వడగళ్ల వానతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నష్టపోయిన పంటలకు సంబంధించి సర్వేచేసి వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించారు. వర్షం కురిసిన మరుసటి రోజే నివేదిక ఇవ్వాలంటే 2005 ఎకరాల్లో పంటలు నష్టపోయారని ఇచ్చారు. నాలుగు రోజుల తరువాత మరో నివేదికలో 3,399 ఎకరాలని పేర్కొన్నారు. చివరకు సమగ్రంగా వారం తరువాత సర్వే నిర్వహించి 7000 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అధికారులు హడావిడిగా ఇచ్చిన నివేదికనే ప్రభుత్వం పరిగణలోకి తీసుకున్నది. 2510 మంది రైతులకు సంబంధించి 3,399 ఎకరాల్లో ఆయా పంటలకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. వీటికి సంబంధించి రూ.3, 39,91,750 ప్రభుత్వం జిల్లాకు విడుదల చేసిందని అధికారులు తెలిపారు.దీంతో నష్టపోయిన పంటల్లో సగం ఎకరాలకే నష్ట పరిహారం వర్తింపజేయగా అది కూడా ఇంకా రైతుల ఖాతాల్లో జమకాలేదు.

గత మూడు సీజన్ల నష్టంపై ఊసేది

2020 ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలు భారీ ఎత్తున దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో 4.5 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు చేయగా 1.25 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు తేలింది. తర్వాతి ఏడాది ఇదే తరహాలో భారీ వర్షాలు కురవడంతో 25 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్టు అధికారులు నివేదికలు పంపారు. ఈ ఏడాదిలో కూడా భారీ వర్షాలు కురవగా 2 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు తేల్చారు. తాజాగా ఇటీవల యాసంగి సీజన్‌లో కురిసిన వడగండ్ల వానకు జిల్లాలో 7వేల ఎకరాల్లో పంటలు నష్టపోగా ఇందులో సగానికి మాత్రమే ప్రభుత్వం పరిహారం వర్తింపజేసింది.

ఇంకా జమచేయలేదు



వరుసగా మూడు వ్యవసాయ సీజన్లలో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. సర్వే నిర్వహించి వివరాలు ప్రభుత్వానికి పంపించాం. ఇటీవల యాసంగి సీజన్‌లో నష్టపోయిన పంటలకు పరిహారం ప్రభుత్వం విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. వాస్తవానికి ఇంకా డబ్బులు రాలేదు. వచ్చిన వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి

నేడు కొండకల్‌కు సీఎం కేసీఆర్



కొండకల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

- మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ, కలెక్టర్

శంకర్‌పల్లి: మేధా రైల్వే కోచ్ ఫ్యాకరీని ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ గురువారం కొండకల్ గ్రామానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, ముఖ్యనేతలు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. ఉదయం 9.45గంటలకు కేసీఆర్ ఫ్యాక్టరీ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఎంపీ రంజిత్‌రెడ్డి కలెక్టర్ హరీష్, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ హర్షవర్ధన్, ఏసీపీ రమణగౌడ్, చేవెళ్ల ఆర్డీవో వేణుమాధవ్, శంకర్‌పల్లి తహసీల్దార్ నయీముద్దీన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయ హోదా ఇవ్వాలి

పాలమూరు– రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండకల్ గ్రామంలో మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రారంభించనున్న నేపథ్యంలో బుధవారం ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణకు మొండిచేయి చూపిన మోదీ సర్కార్ ఎన్నికల నేపథ్యంలో గుజరాత్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని స్థాపించిందన్నారు. ఎక్కడ ఎన్నికలు ఉంటే ఆ రాష్ట్రానికి హామీలను ప్రకటిస్తున్న బీజేపీ నేతలు రాజకీయ లబ్ధి పొందుతున్నారని మండిపడ్డారు. మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీతో తెలంగాణ నుంచి ప్రపంచ దేశాలకు రైలు బోగీలను ఎగుమతి చేయనుండటం సంతోషం కలిగిస్తోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. న్యాయబద్ధంగా తెలంగాణకు ఇవ్వాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయాన్ని పలుమార్లు పార్లమెంట్‌లో ప్రస్తావించినా స్పందన రాలేదని వివరించారు. కేంద్రం సహకరించకపోయినా.. మేధా రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం వంద ఎకరాల భూమి కేటాయించిందని తెలిపారు. దీంతో ఇక్కడ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు బీజం పడుతోందని స్పష్టం చేశారు. ఎంపీ వెంట శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, కొండకల్ ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి, శేరిగూడ సర్పంచ్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఇంద్రాసేనారెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, నాయకులు వాసుదేవ్ ఖన్నా, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరులకు జోహార్లు

- మలిదశ ఉద్యమంలో నలుగురు బలిదానం
- త్యాగాలకు గుర్తుగా స్తూపం

వికారాబాద్ అర్బన్: మలిదశ తెలంగాణ ఉద్యమంలో వికారాబాద్ ప్రాంతంలోని సబ్బండ వర్గాల పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ పోరాటానికి గుర్తుగానే గురువారం జిల్లా కేంద్రంలో అమరవీరుల స్తూపం ఆవిష్కరిస్తున్నారు. విద్యార్థులు, నాయకులు, వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు ఇలా అన్నీ వర్గాల వారు తెగించి కొట్లాడటంతో ఈ ప్రాంతం రణరంగంగా మారింది. నటుడు మహేష్ బాబు ఖలేజా సినిమా సెట్టింగ్‌కు నిప్పు పెట్టడంతో పాటు, సీఎం రోశయ్యను అడ్డుకోవడం, ఆర్టీసీ బస్సులకు నిప్పు అంటించడం, రైలురోకో వంటి ఏ కార్యక్రమం చేసినా వికారాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు దక్కింది. అప్పటి హోంమంత్రి సబితారెడ్డిని ఐదు వేల మంది విద్యార్థులు చుట్టుముట్టిన చోటునే నేడు అమరవీరుల స్తూపం ఏర్పాటుకు ఎంపిక చేశారు. దశాబ్ది ఉత్సవాల పర్యటనకు వచ్చిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి అమరవీరుల స్తూపాన్ని చూసి విద్యార్థులు చుట్టు ముట్టిన సంఘటనను, అప్పటి విద్యార్థి నాయకుడు శుభప్రద్ పటేల్ పాత్రను గుర్తు చేసుకున్నారు. ఇలా మలిదశ ఉద్యమంలో వికారాబాద్‌కు చెందిన మదన్ పల్లి యాదయ్య, మోమిన్ పేటకు చెందిన సిరిపురం ప్రవీణ్, వికారాబాద్‌కు చెందిన దీపక్, పరిగికి చెందిన అస్ఫాక్‌లు ప్రత్యేక రాష్ట్రం కోసం అమరులయ్యారు. వారి జ్ఞాపకార్థమే దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో అమరుల స్తూపం ఏర్పాటు చేస్తున్నారు.

స్తూపాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

వికారాబాద్ అర్బన్: ప్రత్యేక రాష్ట్రం కోసం త్యాగం చేసిన అమరవీరులను గుర్తు చేసుకునేందుకు వీలుగా స్తూపాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం కలెక్టర్ నారాయణ రెడ్డితో కలిసి అమరవీరుల స్తూపాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం మంత్రి సబితారెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.



వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం

అన్ని మతాలు సమానమే

- ఆధ్యాత్మిక చింతన అందరికీ అవసరం
- ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- కలెక్టర్‌తో కలిసి సర్వమతప్రార్థనలు
- ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం

అనంతగిరి: మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకుఆనంద్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం అనంతపద్మనాభ స్వామి ఆలయం, మెథడిస్టు చర్చి, ఎన్నెపల్లి మసీదుల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు మతాలకు అతీతంగా అందరినీ సమానంగా పరిగణిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. దేవాలయాలు, చర్చిలు, మసీదుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ అభినందనీయులని ఆయన కొనియాడారు. అన్ని మతాలు సమానత్వాన్ని ప్రబోధిస్తాయని, ప్రజలంతా ప్రేమభావాలతో కలిసిమెలిసి ఉంటూ అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం మత విశ్వాసాలను కాపాడుతూ, గౌరవిస్తూనే అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలను కాపాడుకునే దిశగా ధూపదీప నైవేద్యానికి నెలకు రూ.10వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అలాగే ప్రత్యేక గురుకులాలను స్థాపించి అన్ని సౌకర్యాలను కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాలను ప్రోత్సహిస్తూనే ఆర్థికంగా ఎదుగుదలకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని ఆయన తెలిపారు. కులాలు, మతాలు సుఖ సంతోషాలతో ఉండాలని సర్వమత ప్రార్థనలు చేసుకోవడం మంచి పరిణామం అని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఆర్డీఓ విజయకుమారి, జిల్లా మైనార్టీ అధికారి సుధారాణి, కౌన్సిలర్లు వివిధ మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



అనంతగిరిలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్



మెథడిస్టు చర్చిలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఘనంగా స్వామి వారి కల్యాణం

ఆధ్యాత్మికోత్సవంలో భాగంగా అనంతగిరిలో ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ప్రత్యేక పూజలు

ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేకాలంకరణలో శివలింగం

తాండూరు టౌన్ : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థానంలోని శివాలయంలో శివుడికి ప్రత్యేకాలంకరణ చేశారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.



క్లుప్తంగా

దాడి కేసు నిందితుల రిమాండ్

మర్పల్లి: దామస్తాపూర్ సర్పంచ్ జైపాల్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తులను బుధవారం మర్పల్లి పోలీసులు కోర్టుకు రిమాండ్ చేశారు. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దామస్తాపూర్‌కు చెందిన విఠల్‌రావుతో పాటు వారి కుటుంబసభ్యులు పాత కక్షలను మనుస్సులో పెట్టుకొని సర్పంచ్ జైపాల్‌రెడ్డికి ఈ నెల 18న దాడి చేసి పారిపోయారు. దీంతో సర్పంచ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారు.

హత్యకేసు నిందితుల అరెస్టు

కొడంగల్ రూరల్: భూ తగాదాల్లో రుద్రారం గ్రామానికి చెందిన నాగరాజును ఈ నెల 19వ తేదీన హత్య చేసిన ఐదుగురు నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శంకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రుద్రారం గ్రామానికి చెందిన నాగరాజు(35)ను 19వ తేదీన పొలంలో దాయాదులు భూ తగాదాల కారణంగా కత్తులు, గొడ్డళ్లతో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు శేఖర్, ప్రభుదాస్, శ్యాంసన్, సునీల్, సుందరయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి


పద్మావతి (ఫైల్)

కొడంగల్ రూరల్: పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన శతాధిక వృద్ధురాలు పద్మావతి జ్యోషి(101) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈ నెల 7న వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శతాధిక ఉత్సవాలు సైతం నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తన పనులు తాను చేసుకుంటూ వంద ఏళ్లు పూర్తి చేసుకోవడం విశేషమని పలువురు పేర్కొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ కృషి మరువలేనిది


జయశంకర్ సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: ప్రత్యేక తెలంగాణ వాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, టీఎన్‌జీవో నాయకులు, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ రాజేందర్‌రెడ్డి

తాండూరు: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. తాండూరులోని మాణిక్ నగర్ ప్రాంతానికి చెందిన అరవింద్, గొల్ల చెరువు ప్రాంతానికి చెందిన అక్రమ్, చాకలి బాబు, ఇంద్రానగర్‌కు చెందిన సయ్యద్ ఆసీఫ్ కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా నుంచి గంజాయి తీసుకొచ్చి పట్టణంలో ప్యాకెట్లను తయారు చేస్తుండగా ఎస్సై మహిపాల్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కిలోకు పైగా గంజాయి లభించింది. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.


వేగ పరిమితి దాటితే ఫైనే

- హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై స్పీడ్‌గన్ల ఏర్పాటు
- డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో తగ్గిన ప్రమాదాలు

పూడూరు: జిల్లాలో రోజు రోజుకూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై స్పీడ్‌గన్లను ఏర్పాటు చేసింది. పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తున్న వాహనాలను స్పీడ్‌గన్ యంత్రంతో వేగాన్ని లెక్కించి చలాన్‌లు వేస్తున్నారు. చలాన రసీదును వాహన యజమాని ఫోన్‌కు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. మూడు చలాన్లు దాటిన వాహనాలు సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తరచూ అంగడిచిట్టంపల్లి, రంగాపూర్, పరిగి, కొడంగల్ వరకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను సంబంధించి పెండింగ్ చలాన్లను ఆన్‌లైన్‌లో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. చలాన్లు చెల్లించని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

ప్రమాదాలను నివారించేందుకు ఈ మార్గంపై తరచూ వాహనాలను చెకింగ్ చేస్తున్నారు. ప్రధాన రోడ్డుపై ఉన్న గ్రామాల వద్ద బారికేడ్లు ఏర్పాటు


స్పీడ్‌గన్ ఏర్పాటు చేస్తున్న పోలీసు

చేస్తున్నారు. చౌరస్తాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాహనాలు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ఓవర్ స్పీడ్‌తో నడిపినా జరిమానాలు వేసి అవసరమైతే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. వేగపరిమితి దాటితే రూ. 1,035 ఫైన్ వేస్తున్నారు. గత ఆరు నెలల్లో స్పీడ్‌గన్‌తో 2,827 వాహనాలకు చలాన్లు వేయడం జరిగింది. 462 పీటీ కేసులు నమోదు చేశారు. 3,474 ఈ చాలన్ల కింద రూ. 9లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించడం జరిగింది. 220 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ – బీజాపూర్ రోడ్డును మూడు వరుసల జాతీయ రహదారిగా మార్చడంతో వాహనాదారులు వేగాన్ని పెంచారు. వచ్చి రాని డ్రైవింగ్‌తో వేగని నియంత్రించలేక అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. యువకులు, డ్రైవింగ్ లైసెన్సులు లేనివారు వాహనాలు ఇష్టారీతిగా నడుపుతూ అమాయకుల ప్రాణాలతో చెలగాడం ఆడుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో తరచూ తనిఖీ చేస్తున్నాం. చౌరస్తాల వద్ద బారికేడ్లు, మూల మలుపుల వద్ద బొలాడ్స్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నాం. స్పీడ్‌గన్‌తో పాటు, డ్రంక్‌అండ్‌డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం.

– గిరి, ఎస్‌ఐ, చన్గోముల్


కేరెళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న లలితకుమారి

పరిశుభ్రత లోపిస్తే చర్యలు తప్పవు

మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి

ధారూరు: అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి హెచ్చరించారు. బుధవారం ధారూరు మండలం బాచారం, కొండాపూర్ ఖుర్దు, కేరెళ్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వికారాబాద్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలని ఆదేశించారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రతి నెలా ఎత్తు, బరువు తీయాలని, బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో వికారాబాద్ ప్రాజెక్టు ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరమ్మ, సూపర్‌వైజర్లు సుశీల, శాంత, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కేసీఆర్ విశేష కృషి


హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో వెలసిన పాంబండ రామలింగేశ్వర ఆలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. నిధులు కేటాయించడంతో పాటు అర్చకులకు వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, పాంబండ ఆలయ చైర్మన్ రాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, రైతుబంధు అధ్యక్షులు రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, బండవెల్కిచర్ల సర్పంచ్ శిరీషారెడ్డి, ఎంపీటీసీ జ్యోతి, నాయకులు బాల్‌రెడ్డి, లక్ష్మయ్య, కృష్ణయ్య, కొండయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తేమ లేకుండా విత్తనాలు వేయొద్దు

డాట్ సెంటర్ సమన్వయకర్త శేఖర్

పెద్దేముల్: భూమిలో తేమ లేకుండా విత్తనాలు విత్తకూడదని డాట్ సెంటర్ సమన్వయ కర్త, శాస్త్రవేత కె.శేఖర్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఆత్కూర్‌లో రైతులకు పంటల సాగుపై పలు సూచనలు ఇచ్చారు. రుతుపవణాలు సంపూర్ణంగా విస్తరించలేదని రైతులు ముందే పత్తి, కంది విత్తనాలు పెట్టరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న శేఖర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కుల్కచర్ల: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్లలో నివాసం ఉంటున్న దోమ మండలం దిర్సంపల్లికి చెందిన రాములు బైక్‌పై పెట్రోల్ బంక్‌కు వెళుతుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో టీవీఎస్ లూనా నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని బాధితుడి అత్త రాములమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.


గాయపడిన రాములు

సమస్యల పరిష్కారానికే ‘పల్లెబాట’


కొత్తపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: సమస్యల పరిష్కారానికే పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కొత్తపల్లి, తిమ్మాపూర్, బాకాపూర్, గొంగుపల్లి, కండ్లపల్లి, ఎన్కేపల్లి, మన్నేగుడ, మీర్జాపూర్ గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధే ధ్యేయం సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు నిధులు కేటాయించి పంచాయతీలను పటిష్టం చేసిందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరు బేరీజు వేసుకోవలని సూచించారు. కండ్లపల్లి, మీర్జాపూర్, మన్నేగూడ తదితర గ్రామాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూపాలని ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. కండ్లపల్లిలో ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. మన్నేగుడలో సమస్యలున్నాయని ఆందోళన చేస్తున్న చేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు అజీం పటేల్, నాయకులు ఖలీల్, సైఫ్‌ఖాన్‌లను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, ఆర్‌ఎస్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆజారుద్దీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు వినోద్‌గౌడ్, మస్రత్‌ఆదిల్, రవి, నాయకులు అజీమోద్దీన్, రహీస్‌ఖాన్ పాల్గొన్నారు.

సమస్యలు చెప్పినా అరెస్టు చేస్తారా..?

పల్లెబాట కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే మహేష్ రెడ్డిని సమస్యలను తెలిపేందుకు వెళ్తే పోలీసులు అరెస్టు చేయడం సరికాదని డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పెంటయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం పల్లె బాటకు వచ్చిన ఎమ్మెల్యేను పనుల కోసం ప్రశ్నించేందుకు వెళ్లిన మన్నేగూడ నాయకులను అజీంపటేల్, ఖలీల్, సైఫ్‌ఖాన్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో కార్యకర్తలు, నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తప్పని సరి

లేకుంటే నష్టాలు తప్పవంటున్న అధికారులు

నవాబుపేట: వానాకాలం సీజన్ ప్రారంభమవుతోంది. రుతుపవనాల కోసం రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సాగుకు సిద్ధంగా ఉన్నారు. ఈ సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఏటా నకిలీ విత్తనాల బారిన పడిన రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు. విత్తు కొద్ది పంట అనే నానుడిని రైతులు గుర్తించి ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

- వ్యవసాయ శాఖ లైసెన్సు పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచి తీసుకోవడం మంచిది.
- కొనుగోలు చేసిన విత్తనాలకు బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలి.
- బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, కంపెనీ పేరు, లేబుల్, పరిమాణం, విత్తన ధర, అమ్మిన వారి సంతకం వంటివి తప్పకుండా ఉండాలి.
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్రం, పంట చేతికి వచ్చే వరకు బిల్లును రైతులు భద్రపరచుకోవాలి.


ఏవో లక్ష్మీప్రసన్న

- విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. విత్తన సంచులను, రైతుల నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చేవరకు ఉంచుకోవాలి.
- నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. బిల్లులన్నీ జాగ్రత్తగా ఉంచుకుంటే విత్తనాలు అమ్మిన వారిపై తగు చర్యలకు సిఫారసు చేయవచ్చు. బాధిత రైతు నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుంది.

నష్టపరిహారం కోసం

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు పరిహారం పొందడానికి అవకాశం ఉంటుంది. విత్తన నాణ్యత ప్రమాణాల కన్నా తక్కువ మొలక శాతం ఉండి, దిగుబడిపై ప్రభావితం చూపినట్లు భావిస్తే కంపెనీపై మండల వ్యవసాయ అధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేయవచ్చు. ముందు జాగ్రత్తతో విత్తనాలు కొనుగోలు చేసుకుంటే మంచిదని ఏవో లక్ష్మీప్రసన్న తెలిపారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

అనంతగిరి: అన్ని వర్గాల వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండలం కొటాలగుడెం గ్రామానికి చెందిన 12 మంది గొల్ల, కురుమలకు 15.75 లక్షల సబ్సిడీతో 252 గొర్రెలను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ముందు వరుసలో ఉన్నామన్నారు. ఓ వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమంలో ప్రభుత్వం దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, జిల్లా వెటర్నరీ ఆఫీసర్ అనిల్‌కుమార్, సర్పంచ్ రాములు నాయక్, కౌన్సిలర్ గోపాల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేటు’లో యూనిఫామ్స్ విక్రయిస్తే చర్యలు


యూనిఫామ్స్ ఉన్న గదిని పరిశీలిస్తున్న మండల విద్యాధికారి

పరిగి: ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫామ్స్, పుస్తకాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారి హరిశ్చందర్ హెచ్చరించారు. పట్టణంలోని గాన్సాలా గారియా ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాంలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. బుధవారం పాఠశాలను తనిఖీ చేసిన ఆయన దుస్తులు, నోట్‌పుస్తకాలు ఉన్న రూంను సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పాఠశాలలు నిర్వహించాలన్నారు.

రైల్లో నుంచి జారి పడి వ్యక్తి మృతి

అనంతగిరి: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మహారాష్ట్ర పూణే ప్రాంతానికి చెందిన రిషికేష్ సాలాంకే (20) హైదరాబాద్ నుంచి పూణేకి వెళ్తున్న రైలులో ప్రయాణిస్తున్నాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వికారాబాద్ రైల్వే స్టేషన్ వద్ద రైల్లో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని వికారాబాద్ మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్విజ్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

తాండూరు రూరల్: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనే యువతి, యువకులు జూలై 1వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సూచించారు. బుధవారం మండలంలోని బెల్కటూర్, వీరారెడ్డిపల్లి, రాంపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో రాష్ట్రంలోని యువతి, యువకులకు ప్రోత్సహించడం కోసం క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల వారు పేరు రిజిస్ట్రేషన్ కోసం సెల్ నంబర్ 76618 99899కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు. జూలై 2వ తేదీ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. గెలుపొందిన వారికి ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్‌తో పాటు మహిళలకు స్కూటీ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్ రెడ్డి, నాగప్ప, అశోక్‌కుమార్, జగదీష్, పురుషోత్తం రెడ్డి, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బెల్కటూర్‌లో క్విజ్ పోటీలపై యువకులకు అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గడ్డివాము దగ్ధం

దోమ: పశువుల మేత కోసం నిల్వ చేసిన గడ్డివాము బుధవారం కాలిపోయింది. మండల కేంద్రానికి చెందిన చిన్న సాయన్న అనే రైతు పశువుల మేత కోసం పొలం వద్ద గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. ఉదయం పొలంలో వరి కొయ్యలకు నిప్పు అంటించగా అది విస్తరించి గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ. 30 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.


కాలి బూడిదైన గడ్డివామి

అభివృద్ధే లక్ష్యంగా అడుగులు

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: నియోజకవర్గంలోని అన్నిగ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తాను అడుగులు వేస్తున్నానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వడిచర్లలో రూ.56లక్షలతో చేపట్టిన పలురకాల పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. గ్రామపంచాయతీ నిర్మాణానికి రూ.20లక్షల శంకుస్థాపన, రూ.23లక్షల సీసీరోడ్లకు నిర్మించిన సీసీరోడ్ల ప్రారంభం, శంకుస్థాపన, ఫార్మేషన్ రోడ్డుకు రూ.10లక్షలతో భూమి పూజ పనులు చేశారు. వైకుంతధామాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాల నుంచి జరగని అభివృద్ధి నేడు సాకారమౌతోందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ హేమిబాయి, బీఆర్‌ఎస్ నాయకులు శేరినారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, దేశ్యానాయక్ తదితరులున్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు దాతలు సహకరించాలి


గంగ్యాడలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ఎంఈఓ గోపాల్

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని ఎంఈఓ గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉబ్బడిపత్తేపూర్, గంగ్యాడ, నారెగూడ, పూలపల్లి, అక్నాపూర్, అత్తాపూర్, చిచంల్‌పేట గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీనివాస్‌గౌడ్ నోట్ పుస్తకాలు పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గోవిందమ్మ, పర్మయ్య, నర్సింహారెడ్డి, అజయ్‌కుమార్, స్వరూప, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాణిక్యం, సురేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.